# ఎదురుచూడని సంఘటన

"మీది ఈ ఊరేనాండీ ? ఇక్కడికెంతదూరం ?" బల్లముందు కూర్చుని ఇడ్లీ తింటూ అడిగాడు బన్ తనకెదురుగా కూర్చున్న ఆయనతో.

సురేంద్ర వచ్చినప్పటినుంచీ బన్ ముఖంలోకి కన్నార్పకుండా చూస్తున్నాడు. ఈ అబ్బాయి ఎవరైఉంటాడు ? తనకు తెలిసిన పోలికలు అతడిలో కనబడటం లేదు. వాటికోసం వెతుకుతున్నాడు.

"బాబూ ఇడ్లీ చల్లారిపోతుంది. చెట్నీ సాంబారు పక్కగా గిన్నెలో పెట్టాను. తీసుకో, కాఫీతెస్తాను" రామమ్మ మరోసారి హెచ్చరించింది.

గబగబా టిఫిన్‌ముగించి లేచి నిలబడి ఇటూఅటూ చూడటం మొదలు పెట్టాడు సురేంద్ర.

"నీసామాన్లు గదిలో పెట్టింది పనిమనిషి. స్నానం చేస్తావా బాబూ ?" రామమ్మ పనిమనిషికి చెప్పింది వేడినీళ్ళు ఏర్పాటు చెయ్యమని.

"అటుకాదండీ ఇటు ఉంది మీ సామానుపెట్టినగది. దాని పక్కనే నీళ్ళ గదికూడా ఉంది. మీకు నీళ్లు అక్కడే సిద్ధంగా ఉంచింది. నాతోరండి చూపిస్తాను." అంటూ బన్ తీసుకువెళ్ళాడు సురేంద్రను.

అతడు తనబట్టలు తీసుకుని స్నానాల గదిలోకి వెళ్ళగానే బనీ బయటికి వెళ్ళటానికి కాళ్లకు బూట్లు వేసుకోవటం మొదలుపెట్టాడు.

అదిచూసి రామమ్మ "చూడు బాబూ ఆయనకు ఇక్కడంతా కొత్తగాఉంది. నీవు కొంచెం సేపుండు. ఆయనకేమయినా కావాలంటే చెప్పటానికీ చెయ్యటానికీ ఉండాలి" అన్నది.

ముళ్లమీద కూర్చున్నట్టుగా కూర్చున్నాడు బనీ కుర్చీమీద. ఆదివారం కనుక ఫుట్‌బాల్ ఆటకు మనసు తొందరపెడుతున్నది.

అంతలో సురేంద్ర హాలుదాటి వాకిటి వరెండాలోకి వచ్చాడు.

''ఏమండీ మీరు పేపర్ చదువుతారా ? ఈ బల్లమీద పెడుతున్నాను. చదువుకోండి. ఆదివారం కదూ సప్లిమెంటుకూడా ఉంది'' ఒక బల్లవైపు చేత్తో చూపించాడు.

''నీవు బైటికి వెళ్ళటానికి తయారయినట్టున్నావు. ఇట్లా వచ్చి ఈ కుర్చీలో కూర్చో. నీ పేరేమిటి ? ఏంచదువుతున్నావు ?'' ఆప్యాయంగా భుజ మీద చెయ్యేస్తూ అడిగాడు సురేంద్ర.

"నాపేరు చాలా పెద్దదండీ - భానుప్రకాశ్. చేంతాడంత ఉంది కదూ ? అంతపెద్ద పేరుతో పిలవలేక అందరూ బనీ అని పిలుస్తారు. రామమ్మమాత్రం బన్నూ అంటుంది.''

సురేంద్ర అతడి మాటలకు నవ్వుకున్నాడు.

"ఇంతకూ చదువుసంగతి చెప్పలేదు ?''

''ఐదో క్లాసులోకి మొన్ననే వచ్చాను. అసలు నేను ఆరోక్లాసులో ఉండాల్సింది. కాని పరీక్షల ముందర జబ్బుచేసింది. అప్పుడు టీచరేమన్నాడంటే ''మళ్ళీ ఈ క్లాసే చదువు మంచి మార్కులతో పాసవుతావన్నాడు. అందుకని ఇందులోనే మళ్ళీచదువుతున్నా.''

సురేంద్రకామాటలు ముద్దొస్తున్నాయి.

''అయితే ఇంట్లో ఎవరెవరున్నారు ?"

''మా అమ్మా నాన్నా ఇక్కడలేరు. ఎక్కడున్నారో నాకు తెలియదు. మా తాతయ్య పదిహేను రోజులకిందట చచ్చిపోయాడు. ఎవరికోసమోనండీ ఇంట్లో అందరూ ఎదురుచూశారు. టెలిఫోన్లు చేశారు. పాపమాయన ''వేళకు రాలేకపోతున్నాను. టికెట్ దొరకగానే వస్తానని'' ఫోనులో చెప్పాడట. ఇప్పుడు ఇంట్లో ఆంటీ నేనూ రామమ్మ పనిమనిషి అచ్చమ్మ ఉన్నాం.''

''ఆంటీ ఎవరు ? ఏంచేస్తుంది ?"

ఆంటీ అంటే ఆంటీయే. చదువుకుంది. పక్కవీధిలో టైపు చేయటం

అందరికీ నేర్పుతుంది. పది మెషీన్లు ఉన్నాయండీ. పెద్దవాణ్ణి అయితే నాక్కూడా నేర్పిస్తానంది.''

"అలాగా! నీవు ఎక్కడికో వెళ్ళాలని తయారయినట్టున్నావు? ఆడుకోడానికా?''

''అవునండి. రేపుమళ్ళీ స్కూలుంది. నా స్నేహితులు ఇవాళ ఫుట్‌బాల్ ఆడదాం రమ్మన్నారు. ఎప్పుడూ చదువుకోవాలంటే విసుగు పుడుతుంది.'' అంటూ పరుగెత్తాడు.

సురేంద్ర పన్నెండేళ్ళయింది ఇల్లు విడిచిపెట్టి, అతడాఊళ్ళోనే పుట్టి పెరిగాడు. అక్కడే చదువుకున్నాడు. ఆ కాలేజీలోనే ఫిజిక్సు లెక్చెరరుగా చేరాడు. తండ్రి వామనరావు ఆ ఊళ్ళోకల్లా పెద్ద లాయరనిపించుకున్నాడు. సురేంద్రకి పెళ్ళిఅయింది. అతడికి విదేశాలకువెళ్ళి రిసెర్చి చేయాలని ఉంది. ఎన్నిసార్లో తండ్రితో అన్నాడు.

''నీవు తండ్రివి కాబోతున్నావు. ఇప్పుడేం చదువుతావురా''

''నేను చదవగలను నాన్నా. నాకాధైర్యముంది. మూడు నాలుగేళ్ళలో తిరిగి వస్తాను. నాకు స్టడీలీవ్ ఇస్తారు.''

''ఒక్కడివే వెళ్తావురా? వచ్చే సంవత్సరంవరకూ ఆగు. సత్యవతిని కూడా తీసుకెళ్ళచ్చు."

''చదువుకోవటానికి వెళ్ళేవాళ్ళు భార్యాపిల్లలతో వెళ్ళితేకష్టం నాన్నా."

''అయితే కోడల్ని విడిచివెళ్తావుట్రా? దానికి నేను ఒప్పుకోను.''

ఈ విషయం తండ్రీకొడుకుల మధ్య రెండేళ్లనుంచీ నలుగుతున్నది.

వామనరావుకు కొడుకును ఒక్కడినీ పంపించటానికి ఇష్టంలేదు. విదేశాలకు వెళ్ళినవాళ్ళు తిరిగి రారనీ వచ్చినా అక్కడే పెళ్ళిచేసుకుని పిల్లలతో తిరిగి వస్తారనీ ఆయన భావిస్తాడు. అతడి స్నేహితులలో ఒకరిద్దరు ఇటువంటిపని చేశారు. ఆ భార్యలను వదిలించుకునేటప్పటికి లక్షలు ఖర్చయ్యాయి.

తండ్రీ కొడుకుల తగాదా తెగకముందే సత్యవతి మగపిల్లవాడిని కని, అదే రోజున కన్నుమూసింది.

సురేంద్ర ఇంక ఆగదలచుకోలేదు. తండ్రీ కొడుకులమధ్య పెద్ద ఘర్షణ జరిగింది మళ్ళీ.

"ఈ స్థితిలో నీవు వెళ్తావుట్రా సురేంద్రా ? నాన్నేకాదు నేనూ ఒప్పుకోను నీవువెళ్ళటానికి. ఆ పసిగుడ్డును ఎవరు పెంచుతారు ? కొన్నాళ్ళయిన తరువాత పెళ్ళిచేసుకుని వెళ్ల. వాడుకాస్త పెద్దవాడయిన తరువాత వాళ్ళను పిలిపించుకో. నీకంతగా వెళ్లాలనిపిస్తే." తల్లి పోరుపెట్టింది.

అతడికి తల్లి ఉపాయం అర్థమయింది. తల్లీ తండ్రీ లేని పావనిని తీసుకువచ్చి పెంచింది. మేనకోడలు వరసేకదా అని పెళ్ళిచెయ్యాలని ప్రయత్నించింది మొదట. కాని తండ్రి యిష్టపడలేదు. ప్రతిరోజూ వాద ప్రతివాదాలతో కోపతాపాలతో రెండేళ్ళు గడిచాయి. చివరకు వామనరావు స్నేహితుడి కూతురితో పెళ్ళి జరిగింది.

ఇప్పుడు సత్యవతి చనిపోవటంతో ఆ సమస్య మళ్లీ తలెత్తింది. సురేంద్రను ఎవరూ ఆపలేకపోయారు. వెళ్ళిన తరువాత ఉత్తరమయినా రాయలేదు.

రాజమ్మ కొడుకు వెళ్లాడన్న బెంగతోనే పిల్లవాడిని పెంచింది. మేనగోడలు బి. ఏ. పాసవగానే అతడికిచ్చి పెళ్ళిచేయాలని సంకల్పించింది. కాని ఆమె అనుకున్నట్టు జరగలేదు. గుండెపోటుతో కొడుకువెళ్ళిన నాలుగేళ్ళకు మరణించింది.

ఈ వార్త సురేంద్ర ఎక్కడున్నాడని తెలుపుతారు ?

వెళ్ళిన ఆరు సంవత్సరాలకు సురేంద్ర తిరిగి వచ్చాడు.

వామనరావు ఇంట్లోనౌకర్లకూ పావనికి కట్టడి చేశాడు. పిల్లవాడికి తల్లి దండ్రుల సంగతి తెలియనివ్వవద్దని.

విదేశాల నుంచి తిరిగి వచ్చిన సురేంద్ర ఎంతప్రయత్నించినా తండ్రి కొడుకును క్షమించలేకపోయాడు. చూసీ చూడనట్టే ఊరుకున్నాడు. అంటీ అంటనట్టే పొడిపొడి మాటలతో గడిపాడు. సురేంద్రమళ్లీ వెళ్ళిపోయాడు. ఆరేళ్ల

బనీకి అతడు తన తండ్రిఅని ఎవరూ చెప్పలేదు. ఎవరో వచ్చారు. పదిరోజులున్నారు. వెళ్లారు. అంతే బనీకి తెలిసిన సంగతి.

సురేంద్ర ఈసారివచ్చి వెళ్ళిన తరువాత వామనరావు మరి ప్రాక్టీసు చెయ్యలేదు. ఇంట్లోనేఉండి క్లయింట్లకు సలహాలిస్తూ ఏదో చదువుకుంటూ ఉండేవాడు. అప్పుడప్పుడు పావనిని గురించి ఆలోచించేవాడు. పెళ్ళిచేసి పంపిస్తే? నని

ఈ ఊహరాగానే అతడిమనసులో ముల్లుగుచ్చుకున్నట్లయ్యేది. తల్లి దండ్రులను చూసి ఎరగని పిల్ల మేనత్తను అమ్మాఅని పిలిచేది. పావని తన చుట్టూ తిరిగి చిన్న చిన్న పనులు చేసిపెట్టేది. కన్నకూతురువంటి భావం ఆయన మనసులో తెలియకుండానే ఆమెపట్ల పెరిగిపోయింది.

రాజమ్మ పోయిననాడు "పావనీ వీడికిదిక్కెవరు ?'' అని కంటతడి పెట్టాడు. పద్దెనిమిదేళ్ళపావని ఆయనభావం తెలుసుకుని 'నేనున్నానుగా'అన్నట్టు చూసింది. అలాగే చేసి చూపించింది. ఆయనకు పావని తన తల్లిలా అనిపించేది ఒక్కొక్కసారి.

"మామయ్యా, పదకొండు గంటలయింది. భోజనానికిరండి" బలవంతంగా భోజనాల యింట్లోకి తీసుకువచ్చి బల్లముందు కూర్చొబెట్టేది. మధ్యాహ్నం రెండు గంటలకు కాఫీ గదిలోకి తెచ్చి చేతికిచ్చేది. పళ్లరసం నాలుగుగంటలకు అందించేది. ఆయన క్లబ్బుకువెళ్ళి ఇంటికి వచ్చేసరికి ఎదురుగావెళ్ళి చేతికర్ర అందుకుని "భోజనం చెయ్యండి మామయ్యా" అనేది. ఇంటిబాధ్యత అంతా తనే వహించేది. డబ్బులెక్కలు చూసేది. పిల్లవాడిని కన్నతల్లిలా చూసుకునేది.

''అమ్మా మంచి సంబంధం చూశాను పెళ్ళిచేసుకో" అంటే ''నా కేమొద్దు" అనేది.

వామనరావుకు ఆమెకు పెళ్ళిచేసి పంపించాలని ఉండేది కాదు. తన ఇంట్లోనే ఆ దంపతులనుకూడా ఉంచుకోవాలని ఉండేది.

కాని పావనికి ఆమాట నచ్చేదికాదు.

వామనరావుకు ఆమె కూతురువంటిది.

బనీకి తల్లిలా కనిపెట్టిచూసే అంటీ.

నౌకర్లకు ఇంటి యజమానురాలు.

బి. ఏ. ప్యాసయిన తరువాత కరెస్పాండెన్సుకోర్సు ఇంగ్లీషు ఎం. ఏ చదువుతోంది.

సన్నగా పొడుగ్గా బారెడు జడతో ఇంట్లో పావని తిరుగుతుంటే వామన రావు కెంతో నిండుగా ఉండేది మనసు. ఛామనఛాయలో చారెడేసికళ్ళతో కొనతేలిన గడ్డముతో ఆమె ఎదురుగా వచ్చినప్పుడు "దీని బ్రతుకు ఎట్లా ?" అన్న ప్రశ్న ఉదయించేది.

సురేంద్ర ఎప్పటికయినా ఇంటికి వస్తాడా ? ఇంతవరకూ ఎవరినయినా పెళ్ళిచేసుకోకుండా ఉన్నాడా ? వచ్చి పావనిని పెళ్ళిచేసుకుంటే ఈ ఇల్లు ఇల్లుగా ఉంటుందికదా నిండుగా ?

ఆయనకదొక భావ వీచిక.

అయనకా ఆత్మీయులైన బంధువులు లేరు. మనసులో మెదిలిన మాట ఏది చెప్పుకుందామన్నా ఒక్క పావని కంటికి కనబడేది.

రోజులు గడిచినకొద్దీ నైరాశ్యం కలుగుతోంది.

పైకి పదిసార్లు అనుకోకపోయినా సురేంద్రమీద బెంగ. ఒకరోజు రాత్రి పక్షవాతం వచ్చి ఒక కాలూ చెయ్యేకాక నోటిమాటకూడా పోయింది.

అప్పుడూ పావని సురేంద్రకు టెలిఫోను చేసింది.

రాజమ్మ ఉన్నప్పటినుంచీ వంటమనిషిగా ఉన్న రామమ్మ ఆయింటికి పెద్ద దిక్కు. నిండుగా నిబ్బరంగా ఎవరితో ఎలా మసలుకోవాలో అట్లా మసలుకుంటూ ఉంటుంది. ఏవిషయమయినా కడుపులో దాచుకోవటమేగాని బయటికి రానివ్వదు.

సురేంద్ర వచ్చిన తరువాత రెండురోజులు ముభావంగా తిరిగాడు. ఇల్లు తను చూసినట్టుగాలేదు. చాలా మార్పులు చేశారు. ఆధునిక సౌకర్యాలెన్నో అమర్చారు ఇంట్లో.

తండ్రిగదిలోకి వెళ్ళి చూశాడు. పెద్దసైజులో తల్లిఫోటో గోడకు తగిలించి ఉంది. అయన లా పుస్తకాల లైబ్రరీ పక్కగదిలో అట్లాగేఉంది. తన గదిలోకి

వెళ్ళి చూశాడు. తన పుస్తకాలబీరువా దుమ్ములేకుండా నిగనిగలాడుతూ పెట్టిన చోటనే ఉంది. బట్టల బీరువాకు తను వేసిన తాళమే ఉంది. జోడుమంచాలూ డ్రెస్సింగ్‌టేబులూ యథాస్థానంలో ఉన్నాయి.

హాలు నిండా సోఫాలూ కుర్చీలూ చెక్కుచెదరకుండా ఉన్నాయి.

హాలుకు పక్కగా ఉన్నగది అన్నిటికంటే పెద్దది. ఆ గదిలో పావనికో మంచం బనీకో మంచం ఉన్నాయి. ఇద్దరికీ చెరొక బల్ల- పుస్తకాల షెల్ఫులూ ఉన్నాయి.

ఇంతవరకూ పావని తన కంట బడలేదు.

బనీ మాత్రం అంటీ అంటీ అంటూ తిరుగుతున్నాడు.

ఈ బనీకి మాత్రం తనెవరో తెలియదు.

ఒకనాడు "అంకుల్ మీరేంచేస్తూ ఉంటారు?" అడిగాడు.

చప్పున తలెత్తి బనీ ముఖంలోకి చూశాడు.

పాపం వాడికి తెలియదా తనెవరో ? ఎవరూ చెప్పలేదా ? ఇంత కట్టుదిట్టాలలో పెరిగాడా ?

"నేనా ? కాలేజిలో ప్రొఫెసరును."

"ఏ ఊళ్లో ఉంటారు ?"

ఆ ప్రశ్నకు సురేంద్రమనసు చలించినట్లనిపించింది.

"అమెరికా ఒక పెద్దదేశం. అక్కడ ఒక ఊళ్ళో ఉంటాను."

"ఈ ఊరికంటె పెద్దదా ? దీనికంటె బాగుంటుందా ?"

"చాలా బాగుంటుంది."

బనీకి అతడిదగ్గర వారంరోజులు గడిచేటప్పటికి కొంత చనువు ఏర్పడ్డది. సురేంద్రతో బజారుకెళ్లటం, అతడేదయినా కొనిస్తే తీసుకోవటం, అతడిని గురించి పావనితో ఎంతో మంచివాడిలా ఉన్నాడని చెప్పటం మొదలయింది.

ఒకనాడు ఇద్దరూ బల్లదగ్గర కూర్చుని భోజనం చేస్తున్నారు. పావని ఇంట్లో లేదు.

సురేంద్రకు పావనిని గురించి అడగటానికి ముఖమాటంగా ఉంది. ఊరికే ఎవరికోసమో చూసినట్టు ఇటూ అటూ చూస్తున్నాడు.

అంతలో పావని బైటినుంచి వచ్చింది.

"భోజనానికి వస్తావా పావనీ" రామమ్మ గదిలోకివెళ్ళి అడిగింది. ఆమె తరువాత వస్తానని చెప్పిపంపించింది.

ఆరోజంతా సురేంద్ర పావనిని గురించి ఆలోచించటం మొదలుపెట్టాడు.

మేనత్త ఏ ఆశతో తీసుకువచ్చిందో ఆ ఆశతోనే ఆమె ఇక్కడ ఉన్నదా? మేనత్త చనిపోయింది. ఆమె భర్తకూడా చనిపోయాడు. ఇంకా ఏ ఆశతో ఈ ఇంట్లో ఉన్నది? ఇంకా ఆమె ఉంటున్నదంటే ఆమెకొక నిశ్చితమైన అభిప్రాయం ఉండే ఉంటుంది. ఆశఉండకుండా ఉంటుందా ఎవరికయినా ?

ఆమెమీద మొదటినుంచీ తనకెటువంటి అభిప్రాయమూలేదు. ఒక అనాథను తల్లి తెచ్చి పెంచుతున్నదన్న అభిప్రాయం మాత్రం మనసులో ఉండేది.

పావని వచ్చింది. వాళ్ళిద్దరూ భోజనంచేశారని రామమ్మ చెప్పగానే పావని కూడా భోజనం చేసి, తన గదిలోకి చేరుకుంది.

ఆమె అతడు వచ్చినప్పటినుంచీ తన బాధ్యతలను అతడికి అప్పగించాలని చూస్తోంది. ఆ సమయం ఎప్పుడు వస్తుంది.

రామమ్మకు అతడు వచ్చినప్పటినుంచీ ఈ సమస్య పరిష్కరింపబడితే బాగుండునని ఆలోచిస్తున్నది. ఆమె ఒక దశాబ్దంపైగా ఆయింట్లో ఉండటంచేత ఆ యింటిమీద, ఆ యింటివారిమీద అభిమానమేర్పడ్డది. తనకూ ఆ సమస్యను పరిష్కరించటములో కొంత బాధ్యత ఉన్నదనిపిస్తోంది.

"సురేంద్రబాబూ, చాలారోజుల తరువాత ఇంటికి వచ్చావు. ఇంక ఇంటి బాధ్యత అంతానీదే. నీవే చూసుకోవాలి. ఆనాటి పసిగుడ్డు ఈనాడు పదిపదకొండేళ్ల వాడయినాడు. మేనత్త పోయినప్పటినుంచీ ఈ యింటిభారం మోసిన పావనిని అమ్మ కోరికప్రకారం పెళ్ళిచేసుకుంటావో ఏంచేస్తావో తేల్చుకో. అన్ని సందిగ్ధంగా

పెట్టుకుంటే లాభము ఏమిటి ? పావని మేనత్తకంటె మీ నాయనగారికి చాలా సేవ చేసింది. అన్నీ మంచందగ్గర అమర్చేది. ఆయనకెదురుగుండా కూర్చుని పేపరు చదివి వినిపించేది. పుస్తకాలు చదివి వినిపించేది. లేకపోతే కబుర్లుచెప్పేది."

''పావనీ నీ బ్రతుకొక్కకమార్గం చూపించలేకపోయానమ్మా. నాకింత సేవ చేశావు. నీఋణం ఎట్లా తీర్చుకోగలనమ్మా?" అంటూ కన్నీరు కార్చేవారు. ప్రాణం పోయేవరకూ ఆమెచేతిని వదలకుండా పట్టుకున్నారు. ఈ బనీ ఆంటీ ఆంటీ అంటూ ఆమె వెంట వెంట తిరుగుతాడు. కొంటెతనమెక్కువ. అయినా ఆమె చెప్పగానే వింటాడు. మేనత్త పోయినప్పటినుంచీ ఇంటిని చక్కదిద్దుకుని వస్తోంది వంకలేకుండా."

అతడికంతా అర్థమైపోయింది. ''ఈ ఇంటినీ పిల్లవాడినీ తన తండ్రినీ చేతిలో పెట్టుకుంది, బాగా పాతుకుపోయింది. ఇల్లు వదలటం కష్టమే. పిల్లవాడిని మంచిచేసుకోవాలి. ఆస్తి వ్యవహారాలు తెలుసుకోవాలి, వాటిని తెగనమ్మి వెళ్ళిపోవాలి పిల్లవాడిని తీసుకుని.'' అతడికివే ఆలోచనలు.

కాని ఆమె ఇంతవరకూ తనతో ఒక్కమాట మాట్లాడలేదే? "వీడెవడో వచ్చాడు. వచ్చినట్టే వెళ్ళిపోతాడు. అతడితో నాకేంపని?'' అనుకుంటోందా ? అటువంటి ఆటలు తనదగ్గర సాగవని ఆమెకు తెలియదేమో ?

బనీకు పరీక్షలు వారంరోజుల్లో ప్రారంభమవుతాయి. పావని అతడిని బాగా చదివిస్తోంది. బనీకూడా ఆమె చెప్పినట్టు విని చదువుతున్నాడు.

సురేంద్రకు ఇదొక ఆటంకమేర్పడ్డది.

వారంరోజులపాటు తలఎత్తకుండా చదివి పరీక్షలు రాశాడు బనీ. తరువాత ఒక టీచరు స్కూలుపిల్లలను తీసుకుని దేశంలోని ముఖ్యప్రదేశాలను చూపించటానికి బయలుదేరుతున్నట్టు బన్ పావనికి చెప్పాడు.

పావని స్కూలుకు వెళ్ళి హెడ్‌మాస్టర్ని అడిగి వివరాలు తెలుసుకుంది. ఒక టీచరు కాదు, ఇద్దరు వెళ్తున్నారు.

"పిల్లలను దక్షిణభారత మొకసారి, ఉత్తరభారత మొకసారి ఇలా టీచర్లనిచ్చి పంపిస్తున్నాం. అయితే పిల్లలందరూ బయలుదేరటంలేదు. డబ్బుకావాలి. స్కూలువైపు నుంచి మేము పంపలేము".

"పిల్లలను నీళ్ళదగ్గరికి ఇటూ అటూ తిరగకుండా జాగ్రత్తగా చూస్తారా ? ఎక్కడయినా జబ్బుపడితే ?"

"అటువంటి భయంలేదమ్మా. అన్ని జాగ్రత్తలూ తీసుకుంటాము. మీర న్నట్టు జ్వరాలు అవీ రావచ్చు. పిల్లలకు భోజనపుఏర్పాట్లు జాగ్రత్తగా చూడ టానికే ఇద్దరు టీచర్లు వెళ్తున్నారు. ఏకాస్త అనారోగ్యం కలిగినా వెంటనే మందు లిప్పిస్తారు. పిల్లలు టీచర్లకు తెలియకుండా ఎటూ వెళ్ళటానికి వీలులేదు" అని హామీ ఇచ్చాడు.

"ఏరా బనీ. అన్నీ తెలుసుకువచ్చాను. నీవు మాత్రం టీచర్లు చెప్పినట్టు విని, జాగ్రత్తగా ఊళ్ళన్నీ తిరిగిరా. వాళ్లకు చెప్పకుండా ఎక్కడికీ వెళ్ళకు. అట్లా అయితేనే డబ్బు కట్టివస్తాను. ఇరవై రోజులు పట్టవచ్చునన్నారు మీ హెడ్ మాస్టరు. మరి ఈ షరతులన్నిటికీ నీవు ఒప్పుకుంటే పంపుతాను."

"ఆంటీ. నేను ఎక్కడికీ వెళ్ళను. వాళ్లు చెప్పినట్టే వింటాను. ఊళ్లన్నీ తిరిగి వస్తాను" ఒప్పుకున్నాడు బనీ.

మూడోనాడే ప్రయాణం. బనీ బట్టలన్నీ ఉతికించి ఇస్త్రీచేసింది పావని. బట్టలన్నీ లెదర్‌బాగ్‌లోకి సర్దింది. డాక్టరు దగ్గరికి తీసుకువెళ్ళి ఒక ఇంజెక్షను ఇప్పించి తీసుకువచ్చింది అంటువ్యాధులు సోకకుండా.

ఇంట్లో ఏంజరుగుతున్నదో సురేంద్ర చూస్తునేఉన్నాడు.

పిల్లవాడిని పంపించనా అని పావని అడుగుతుందేమోననుకున్నాడు. అటు వంటిదేమీ జరగలేదు.

ఆ సాయంకాలం కాఫీ టిఫిన్ తీసుకునేటప్పుడు "ఏమోయ్ బనీ ? చాలా హుషారుగా ఉన్నావు ? ఏమిటీ సంగతి ?" అడిగాడు.

"మా స్కూలు నుంచి కొందరు పిల్లలూ టీచర్లూ దక్షిణదేశంలోని చారి త్రక ప్రదేశాలు చూడటానికి వెళ్తున్నాం. రేపేప్రయాణం" అన్నాడు బనీ సంతో షంగా.

"అలాగా నా వంటివాళ్ళు రావచ్చా?"

"వీళ్లేదు స్టూడెంట్లూ టీచర్లూ మాత్రమే"

''ఒకవేళ వస్తే?''

''మీదారి మీది-మాదారి మాది''

''అంతేనా?''

''అంతేనండి''

''నాకూ చూడాలనిఉంది.''

"వెళ్లండి దానికేం? డబ్బుండాలి. ఉంటే అన్నీ చూడచ్చు. మాకయితే మాటీచర్లు వెంబడిఉంటారు. కాబట్టి అన్నీ చూపించి పాఠాలుకూడా చెబుతారు"

"పద్ధతి చాలా బాగుంది. కాని - ఏంలాభం? నన్ను నీ వెంట రావద్దంటున్నావుగా?"

"అవునండీ హెడ్‌మాస్టరుగారిష్టం. అడిగిరానా?"

"వద్దులే. నీ తెలివికి తగినట్టు అదృష్టవంతుడివి. నీకు కావలసినంత డబ్బిచ్చి పంపించే వారున్నారు. నాకే ఎవరూలేరు"

గర్వంగా నవ్వుకున్నాడు బనీ.

ఆ సాయంత్రం బనీ వెళ్ళేటప్పుడు ఇంట్లో అందరికీ చెప్పాడు. స్కూలుకు వెళ్ళి మిగతావాళ్ళనూ టీచర్లనూ కలుసుకుని వేళకు బయలుదేరాలి.

ఆ ఊళ్లో సురేంద్రకు తెలిసినవాళ్లలో చాలా మంది ఇప్పుడు లేరు. అతడితోటివాళ్లు ఉద్యోగాలలో ఎక్కడెక్కడున్నారో తెలియదు. తండ్రి సమకాలికులు చాలా మంది ఈ లోకంలోనేలేరు. అతడికి కాలం గడపటంలేదు. ఆ ఊరిక్లబ్బు ఏమి బాగుండదని అతడనుకున్నాడు. కాని ఒకనాడువెళ్ళి చూశాడు. చాలామంది యువకులున్నారు. టెన్నిస్ ఆడుతున్నారు. కార్డ్సు ఆడటానికి మూడు టేబుల్సు ఉన్నాయి.

అతడికి వాళ్ళతో కలవాలనిఉంది. వాళ్లెవరూ ఇతడిని అంతగా పట్టించుకోలేదు. తనే ఒకరిని అడిగాడు-''నేనూ మీతో బ్రిడ్జి ఆడవచ్చా?"

"ఓ తప్పకుండా"

ఆ రోజు రాత్రి ఎనిమిది గంటలవరకూ అది ఇంటికి బయలు దేరుతూ ఉండగా "మీ దారిలోనే మా ఇల్లుఉంది. ఒకసారి లోపలికిరండి. మా నాన్న గారు ఈ ఊరిపెద్ద లాయర్లలో ఒకరు. పెద్దవారయిపోయారు. ఎక్కడికీ ఒంటరిగా వెళ్ళలేరు. ఎవరయినావచ్చి కబుర్లు చెప్పాలని ఉంటుందాయనకు. ఎవరువస్తారు పెద్దవాళ్ళతో మాట్లాడటానికి? మీరువచ్చి ఐదునిమిషాలు కూర్చున్నా సంతోషిస్తారురండి" తీసుకువెళ్ళి తండ్రి కుర్చీదగ్గర కుర్చీవేశాడు.

"మీదీఊ రేనా బాబూ?"

"అవునండి. నేను ఈ దేశం వదిలిపెట్టి పదకొండేళ్ళయింది. మధ్యలో ఒక సారి వచ్చానుగాని వారమే ఉన్నాను."

''అలాగా? మీ నాన్నగారు....

"లేరండి. ఆయన పోయారని ఫోనుకాల్ వస్తే వచ్చాను"

"పేరు?"

అతడు చెప్పిన తరువాత ''వామనరావుకొడుకువా? చెప్పవేం అప్పటినుంచీ? వాడూ నేను కాలేజీ రోజులప్పటినుంచీ స్నేహితులం. నీవు ఈ దేశం వదిలివెళ్లావని చాలా బాధపడ్డాడు. మళ్ళీరావనే అనుకునేవాడు. ఇప్పుడు నీవొచ్చావు. వాడు లేడు చూసి సంతోషించటానికి"

"అవునండి వెంటనే టికెట్ దొరకలేదు"

"నీ కొడుకెలా ఉన్నాడు? వాణ్ణి చూసుకుని ఒకసారి సంతోషిస్తూ ఒకసారి కన్నీళ్లు కార్చేవాడు. ఇంతకూ మళ్ళీ పెళ్ళి చేసుకున్నావా?"

"లేదండీ. నేనే నిలకడగా ఒక దేశంలో ఉండటంలేదు. రీసర్చి పేరున ఇక్కడా అక్కడా తిరుగుతూ ఉన్నాను"

"అన్నట్లు ఇంట్లో ఒక అమ్మాయిని పెంచుతున్నామని ఎప్పుడో అన్నాడు మీ నాన్న. ఆ అమ్మాయికి పెళ్ళి కాలేదన్నాడులే."

సురేంద్ర మాట్లాడలేదు.

"అన్నట్టు మీ నాన్న రెండేళ్ళక్రిందటివరకూ తిరుగుతునే ఉన్నాడుగా. నీకేం ఉత్తరం రాయలేదా?"

"రాయటం తక్కువేలెండి. నేనుమాత్రం? ఎప్పుడో ఒకసారి రాసేవాడిని."

''ఆ అమ్మాయికి సగం, మనమడికి సగం ఆస్తంతా విల్లు రాశాడు. నేను బాగా ఆలోచించమని రెండుసార్లన్నాను ''మనం అక్కరలేనివాళ్ళకు మన ఆస్తి పాస్తు లెందుకు?'' అన్నాడు.

ఆ మాటకు సురేంద్రమనసు చివుక్కుమన్నది.

తను తలిదండ్రులను అక్కర్లేదనుకున్నాడా? లేక తను ఆదేశానికి వెళ్ళిన తరువాత ఆయనకట్లా అనిపించిందా?

కొద్దిసేపు కూర్చుని ఇంటికివచ్చాడు.

మామూలుగా ఉదయం లేవగానే రామమ్మ కాఫీ ఇడ్లీ బల్లమీద పెట్టింది.

''నేను రెండు మూడు రోజుల్లో వెళ్ళిపోతున్నాను'' అన్నాడు.

''అదేమిటి బాబూ, మీరు పెళ్ళిచేసుకుని ఇక్కడే ఉంటారను కుంటున్నాం అందరం.''

"ఇక్కడెందుకు ఇంక? ఎవరున్నారు చూడటానికి? వచ్చానుగాని నాన్నను చూడలేకపోయాను."

"అదేమిటి బాబూ! చిన్నపిల్లవాడు బన్నును వదిలిపెట్టి వెళ్తారా? వాడికి తల్లిలేనేలేదు. తాతా బామ్మలుకూడా వెళ్ళిపోయారు. పావనిని పెళ్ళిచేసుకుంటావని మీ నాన్నా అమ్మలు ఆశించారు. వాళ్ళులేకపోయినా వాళ్ళ కోరిక తీర్చవలసిన బాధ్యత ఉంది''

''బన్ను నా కొడుకని ఎవరయినా చెప్పారా? అసలీ యింట్లో ఎవరున్నారో నాకు తెలిస్తేగా? నేను హోటల్లో ఉన్నట్టుగా ఉంటున్నాను''

"పొరబాటు బాబూ-పొరబడ్డారు. తొందరపడకండి''

ఆ సాయంత్రం కాఫీ తాగేటప్పుడు పావని బల్లదగ్గర కూర్చుంది.

"నాపేరు పావని'' అంది.

అతడు కళ్ళెత్తి చూశాడు.

''అత్తయ్య పోయినప్పటినుంచీ ఈ యింటి ఆదాయవ్యయాలు నేనే చూస్తున్నాను. ఈ ఉదయంవరకూ జమాఖర్చులు రాశాను. అత్తయ్యనగలు ఇనప్పెట్టిలో ఉన్నాయి. మామయ్యకూ నాకూ జాయింట్‌గా బ్యాంకిలో డబ్బుంది. ఆయన పోయిన తరువాత బ్యాంకువాళ్లు ఆ పేరుతీసి ఇంకోపేరు పెట్టమన్నారు. నా పేరు కూడా రేపటినుంచీ ఉండదు. మీ సామానూ ఇంటిలెక్కలు మొత్తం లెక్కచూసుకోండి ఇవి ఇనప్పెట్టె తాళాలు''

అతడు నిర్విణ్ణుడయ్యాడు.

''నాకు ఉద్యోగంవచ్చింది. వెళ్ళిపోతున్నాను.''

"మీరు వెళ్ళటమెందుకు? నేనే వెళ్లాలి. ఈ ఇల్లూ ఈ ఆస్తిపాస్తులూ మీకు బనీకే చెందాలని నాన్న విల్లురాశాడట. నాకు వాటితో ఏం సంబంధంలేదు.''

''మీరు దగ్గరలేరన్న నిరాశతో మామయ్య అట్లా రాసిఉంటారు. నా మీద పెంచిన ప్రేమతో సగం ఆస్తి నాపేర రాశారు. అంతమాత్రంచేత నేను ఆస్తిని తీసుకుంటాననుకున్నారా? లేదు. నాకు తల్లీ తండ్రీలేరు కాని కొద్దిపాటిడబ్బుంది. ఇక్కడొక ఇన్‌స్టిట్యూట్ పెట్టాను. నేను వెళ్ళేటప్పుడు అమ్మేస్తాను. నన్ను పెంచినందుకు ఈ ఇంటిని చూడవలసివచ్చింది అంతే."

"నేనులేనిలోటు తీరేటట్టుగా నా తల్లిదండ్రులకు అంత సేవచేశారు. ఈ ఆస్తిపాస్తులకు నేను అనర్హుడను."

''నన్ను పెంచినందుకు నేను వాళ్ళకు సేవచేసి ఋణం తీర్చుకున్నాను. మీ కొడుకును జాగ్రత్తగా పెంచాను. వాడు తిరిగివస్తే నన్నువెళ్ళనీయడు. మీకు సందేహంలేకుండా ఈ విల్లును మీ కళ్ళముందరే చింపేస్తున్నాను''

అతడికి నోటమాటరాలేదు. తనిక్కడికి వచ్చినప్పటినుంచీ ఆమె తన కంట బడలేదు. అది తనపట్ల నిర్లక్ష్యమనుకున్నాడు. ఆస్తి చేతచిక్కించుకున్న మనిషికి తనమీద గౌరవం ఎందుకుంటుందనుకున్నాడు. ''బనీతో ఈ ఇంట్లో హాయిగా ఉందామనుకుంది కాబోలు మర్యాదకోసమైనా ఇంటికి వచ్చినవాడిని పలకరించకుండా ఉండటంలోనూ, బన్నునుగురించి తనకు చెప్పకపోవటంలోనూ ఉన్న అంతరార్థం ఇదే కావచ్చు ననుకున్నాడు.

ఆమె మాటలు చాలా కచ్చితంగా ఉన్నాయి. రాజీకి అవకాశం లేకుండా మాట్లాడింది.

తనమీద కోపమా?

క్షమించమని అడిగితే?

తనకోసం కాదు-బనీకోసం.

ఆమె లేచి లెక్కల పుస్తకాలు పంపించింది.

ఆ రాత్రి అతడు తల్లిదండ్రుల గదిలోకి వెళ్లాడు. తల్లి ఫోటో పక్కన తండ్రి ఫోటో అతికించి ఫ్రేమ్ చేసినట్టుంది. ఈ పని పావనే చేసిఉంటుంది. తల్లి పోయిన తరువాత తను వచ్చినప్పుడదిలేదు. ఇల్లు ఆధునికంగా బాగుచేయించింది కూడా పావనే అయిఉంటుంది.

అతడి మనసంతా కల్లోలంగాఉంది. ఇప్పుడేంచేయాలి?

మరునాడు సాయంత్రం తన తల్లిదండ్రుల ఫోటోలకు పూలహారంవేసి నమస్కరించింది పావని. నౌకర్లకు బనీను బాగా చూసుకొమ్మని చెప్పింది.

సురేంద్ర గదిలోకివచ్చి చేతులుజోడించింది.

''ఈ యింట్లో పెరిగి పెద్దదాన్నయ్యాను'' అనుకుంటూ సింహద్వారాన్ని కళ్లకద్దుకుంది.

వెనక్కి తిరిగిచూస్తూ సూట్ కేసుతో బండి ఎక్కింది.

సురేంద్ర గడపలో నిలబడిపోయాడు. తను ఆమెను గురించి తప్పుగా అంచనా వేసుకున్నాడు. అందుకు అతడితల భూమిలోకి దిగిపోతున్నట్టుగాఉంది.

మాతృమూర్తిగా గుండెకు హత్తుకుని పెంచిన తల్లిని బనీకి లేకుండా చేశాడా తను?

ఆమెపట్ల తనకున్న అభిప్రాయాలనన్నిటినీ తారుమారుచేసి వెళ్లిపోయింది.

నాలుగురోజుల క్రిందటివరకూ ఆమెను పిలిపించి తన మనసులో మరుగుతున్న అక్కసునంతా వెళ్ళగ్రక్కి కసితీర్చుకోవాలనుకున్నాడు.

కాని-తనకా అవకాశమివ్వకుండా ఆమె వెళ్ళిపోయింది.

అతడికి మెత్తటి చెప్పుతో కొట్టినట్లయింది.

❋❋